

# అచ్చిరాని ఆస్తి

**గుం**పులో ఎవరో ఒకడు ఆయనతో "ఉపదేశకా! వారసత్వంగా వచ్చిన ఆస్తిలో నా భాగం పంచిపెట్టమని మా అన్నకు చెప్పండి" అన్నాడు. అందుకాయన అతనితో "అయ్యా, ఆస్తులు పంచి పెట్టడానికి మీమీద నన్నెవరు తీర్పరిగా నియమించారు?" అన్నాడు. వారితో "ప్రతి విషయంలో అత్యాశకు చోటివ్వకుండా జాగ్రత్తగా చూచుకోండి! జీవితానికి మూలాధారం అధిక సంపద కాదు" అన్నాడు. అప్పుడాయన వారికొక ఉదాహరణ చెప్పాడు. "ఆస్తిపరుడొకడు ఉండేవాడు. అతని భూమి బాగా పండింది, గనుక అతడిలా లోలోపల ఆలోచన చేశాడు. నా పంట నిలవ చేయడానికి స్థలం లేదు. ఏం చెయ్యను? ఇలా చేస్తాను - నా గిడ్డంగులు పడగొట్టి వీటికంటే పెద్దవి కట్టిస్తాను. వాటిలో నా ధాన్యం, నా సరుకులు అన్నీ నిలవచేస్తాను. అప్పుడు నా ప్రాణంతో నేనంటాను, "ఎన్నో సంవత్సరాలకు సరిపడేటంతగా కూడబెట్టాను. హాయిగా బతుకు, తిను, తాగు, సంబరపడు" అన్నాడు. అయితే అతనితో దేవుడు అన్నాడు 'తెలివితక్కువవాడా! ఈ రాత్రే నీవు ప్రాణం విడవవలసి వస్తుంది. నీవు సిద్ధం చేసుకొన్నది అప్పుడు ఎవరిదవుతుంది? దేవుని విషయంలో ధనవంతుడు కాకుండా తనకోసమే కూడబెట్టే వ్యక్తి గతి అంతే."

**యేసు ప్రభువు ప్రబోధించిన ఒక ఉపమానం ఇది.**

'ఉపమానం' అంటే 'పారమార్థిక సత్యము'ను సాదృశ్యం చేసే కథ. ఈ కథలోని ధనవంతుడు తన ధనంవల్ల ధన్యుడు కాలేదు, భ్రష్టుడయ్యాడు. దానికి కారణాలు మూడు.



## 1. ఇతడు అజ్ఞాని

ఇతడు ఎంతో కృషి చేస్తేగాని అంతటి పంటను కోసి ఉండడు. పండిన పంటను పదిలంగా కాపాడుకోవడం కోసం మంచి ఏర్పాట్లే చేశాడు. కొత్త గాదెలు కట్టించాడు. ఇంకా మిగిలిన పంటను అమ్మి సొమ్ముచేసుకున్నాడు. ఊళ్ళో ఉన్న వాళ్లంతా ఇతని జ్ఞానాన్ని మెచ్చుకొని ఉంటారు. ఎవరు మెచ్చుకోకపోయినా లోభి ఆత్మ ప్రశంసలో అందెవేసిన చెయ్యి. లోభికి లోకమంతా తనకోసమే ఉన్నట్టు అనిపిస్తుంది. ఇది సాటిలేని అజ్ఞానం. అందుకే యేసు ఇతణ్ణి "వెర్రివాడా!" అని సంబోధించాడు.

## 2. ఇతడు అల్పాయుష్కుడు

కలిమి కెరటాల వలే పొంగివస్తుంటే, ఆ సంపద ఎప్పుడూ ఇలాగే ఉండిపోతుందనీ, ఆ కలిమివల్ల దీర్ఘాయువు కలుగుతుందనీ, అనేక సంవత్సరాలు అవలీలగా బ్రతక వచ్చుననీ, పరిస్థితులెలా మారినా కదలని పునాదులు ఉన్నాయనీ, రాబోయే సంవత్సరాలను ఊహించుకుంటూ పారవశ్యం చెందాడు. అయితే ఆ రాత్రి అతనికి అది చివరిదన్న సంగతి ఇతని ఊహకు కూడా అందలేదు.

## 3. ఇతడు ఆత్మవంచన చేసుకున్నాడు

ఇతడు తన ప్రాణం తనదే అనుకున్నాడు. అది కూడా దేవుడిచ్చినదేనని, ఎప్పటికైనా తన ఆత్మ దేవునికి చెందినదేననీ,

తన జీవితాన్ని గూర్చి దేవునికి సంజాయిషీ ఇవ్వవలసిన బాధ్యత ఉన్నదనీ అతడు గుర్తించలేదు. వంచనలన్నిటి లోనూ ఆత్మ వంచన అతి ఘోరమైనది. అయితే దేవుడు ఒక్కసారే 'నీ ప్రాణం నీది కాదు' అని సెలవిచ్చాడు. అసలు సత్యం ఇది.

సిరి అదుపులో ఉంటే అది మంచి సేవకుడు, మనం దాని వశం అయితే అదే మనపాలిట మహా రాక్షసి. ధనాపేక్షలో అహంభావం జనిస్తుంది. ఇలాటి లోభత్వానికి ఆహుతి అయిపోయిన వ్యక్తి దేవుని కన్నా ధనాన్నే హృదయంతో ఆరాధిస్తాడు. కలిమి ఎదుట మోకరిల్లే వాడు. ఆధ్యాత్మికంగా కాటికి కాళ్ళు చాపినవాడే. భోగ భాగ్యాలతో దైవిక బాధ్యతలు కూడా ముడిపడి ఉన్నాయని గుర్తించడమే పరమార్థిక జ్ఞానం. ఇలా గుర్తించనపుడు మనం ఎంత గడించినా అది మనకు అచ్చిరాని అస్తియే అవుతుంది.

అయితే శాశ్వత పరలోక సంపదలు యేసుప్రభువులో గుప్తమై ఉన్నాయి. ఆ సిరి సంపదలు నీవు పొందావా?

**క్రైస్తవ సత్య గ్రంథశాల**
**ప్యాడిసన్‌పేట, తెనాలి-522 201**

**Christian Truth Book Room,** Paddisonpet, Tenali–522 201

Telugu-115 "Worthless Wealth"